## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ తొలగింపుతో పద్మారావునగర్ పార్కు ముందు విశాలంగా రోడ్డు

**పద్మారావునగర్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. పెద్ద ఎత్తున చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే డబ్బాలు, చిరు వ్యాపార కార్యకలాపాలను తొలగించారు. పద్మారావునగర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌లపై వెలిసిన డబ్బాలు, తోపుడబండ్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్‌ఐ కరుణాకర్ తదితరులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించారు.

## గణతంత్ర వేడుకల సందర్భంగా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నరసింహన్ కన్నన్ తదితరులు

**రసూల్‌పురా:** బొల్లారం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కంటోన్మెంట్ నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. డౌటన్ బజార్‌లోని బొల్లారం రీడింగ్ రూం ఆవరణలో వాలీబాల్, క్యారమ్స్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. యువకుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాకులు, ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ నరసింహకన్నన్ తెలిపారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ప్రతినిధులు అరవింద్, బాల్‌రాజ్, ఆంథోని, సుశీల్, కన్నా, సతీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

**కంటోన్మెంట్:** బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకే అభివృద్ధి పనులు చేపడుతున్నామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం ఐదోవార్డు వాల్మీకి నగర్‌లో బోర్డు నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వాల్మీకి నగర్ లో పర్యటించినప్పుడు స్థానికులు రోడ్డు సమస్య గురించి చెప్పారన్నారు. ఈ మేరకు వారికి ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మురుగేశన్, సదానంద రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పికెట్ కేంద్రీయ విద్యాలయంలో వేడుకలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్



పద్మారావునగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



లాలాపేటలో పాల్గొన్న బీజేపీ నాయకులు

# నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం

## ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జన్మదిన వేడుకలు గురువారం సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి, అది ఆచరణలో పెట్టిన మహనీయుడన్నారు. నేతాజీ జన్మదినాన్ని పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటూ ఆయన ధీరత్వాన్ని నేటి తరానికి తెలియజేస్తూ వస్తున్నట్లు చెప్పారు.



సనత్‌నగర్ : వేడుకల్లో వెల్లాల రామ్మోహన్ తదితరులు



అడ్డగుట్ట: సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**సనత్‌నగర్:** అల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సనత్‌నగర్ ఫీడర్ పరిధిలోని సౌభాగ్యనగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, కై లాష్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వకండి



అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు

**అమీర్‌పేట:** మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు బాధ్యులు కావొద్దని ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సైదులు అన్నారు. గురువారం ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలకు సంబంధించి చలాన్ విధించారు.

# మహిళాభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ కృషి

**సనత్‌నగర్:** మహిళాభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని, వీటిపై మహిళలను చైతన్యపరిచి పార్టీ సభ్యత్వ నమోదుకు ముందుకువచ్చేలా కార్యకర్తలు చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. గురువారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. డీసీసీ మహిళా అధ్యక్షుడు కవిత, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పటిష్టతకు కృషి చేయండి

**సనత్‌నగర్:** నూతన డివిజన్ల అధ్యక్షులు రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి సూచించారు. బీజేపీ బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన రామాంచ మహేష్ గురువారం బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో మర్రి పురురవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌ను ఆయన అభినందించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి సామాన్య ప్రజలకు వివరించాలన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

**ఎమ్మెల్యే శ్రీ గణేష్**

**అడ్డగుట్ట:** పేద ప్రజల సంక్షేమాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మారేడ్‌పల్లి మండల తహశీల్దార్ కార్యాలయం పరిధిలోని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 17 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేష్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, అందులో భాగంగా ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే జరుగుతుందని తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో జాయింట్ సీఈవో పల్లవి పర్యవేక్షణలో సర్వే జరుగుతుందని, ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే సర్వే పూర్తయిందని చెప్పారు. ఇది పూర్తి కావడానికి మరో 10 నుంచి 15 రోజుల సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ భీమయ్య గౌడ్, సిబ్బంది మోహన్, సురేష్, కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

# మైనర్లకు వాహనాలివ్వొద్దు

**రసూల్‌పురా:** మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తిరుమలగిరి ఆర్‌టీఏ ఎర్రిస్వామి పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్టీఏ, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తిరుమలగిరి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారి స్వామి మాట్లాడుతూ గత నెల రోజులుగా సికింద్రాబాద్, కంటోన్మెంట్ పరిధిలో రహదారి భద్రతలపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ, ట్రాఫిక్ సిబ్బంది

## రైలు బోగీలో గుర్తు తెలియని మృతదేహం

**సికింద్రాబాద్:** చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో నిలిపి ఉంచిన ఒక రైలు బోగీలో వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వేపోలీసులు తెలిపిన మేరకు.. చర్లపల్లి రైల్వేస్టేషన్ 7వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచిన రైలు ఖాళీబోగీలో మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద పోలీసులకు ఎటువంటి వివరాలు లభించలేదు. సుమారు 65 ఏళ్ల ఉన్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## వ్యక్తి అదృశ్యం



స్వామి, ఫైల్

**అడ్డగుట్ట:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. తుకారాంగేట్ వడ్డెరబస్తీకి చెందిన స్వామి(40)కి భార్య, ఇద్దరు పిల్లలు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిన స్వామి తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు తమకు తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసి, పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం రాత్రి ఆయన భార్య సంగీత తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## మద్యం మత్తులో వీరంగం.. ఇద్దరి రిమాండ్



వెంకటేష్, ఉదయ్ కిరణ్

**అడ్డగుట్ట:** మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు ఓ వ్యక్తిపై దాడిచేశారు. లాలాగూడ ఎస్‌ఐ కిషోర్ తెలిపిన మేరకు.. శాంతినగర్‌లోని కట్టెల మండి మార్గంలో ఈ నెల 9న కృష్ణ అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో స్థానిక ప్రాంతానికి చెందిన వెంకటేష్ గౌడ్(25), ఉదయ్ కిరణ్(22) రోడ్డు పక్కనే కూర్చొని మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో కృష్ణ వారిద్దరి వైపు చూసుకుంటూ వెళ్తున్నాడు. దీంతో వెంకటేష్, ఉదయ్‌లు కృష్ణను దూషించడమే కాకుండా అతనిపై ఇద్దరు కలిసి దాడి చేశారు. దీంతో గాయాలపాలైన బాధితుడు మరుసటి రోజు స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా ఆరు రోజుల జైలు శిక్ష విధించారు.

## విద్యార్థి అదృశ్యం



కె.తనుష్ కాంబ్లే(ఫైల్)

**లాలాపేట:** స్కూల్‌కు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండికి చెందిన కె. తనుష్ కాంబ్లే (14) రవీంద్రనగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 22న ఉదయం అతని తండ్రి విశాల్ స్కూల్లో వదలివెళ్లాడు. స్కూల్ అనంతరం తనుష్ సీతాఫల్‌మండిలోని ఆర్యసమాజ్ సమీపంలో ట్యూషన్‌కు వెళ్లాడు. ట్యూషన్ ముగిసిన తరువాత తనుష్ ఇంటికి చేరుకోలేదు.దీంతో పోలీసులక ఫిర్యాదు చేశారు.

## సంస్కృతానికి సాంకేతిక రంగంలోనూ ప్రాముఖ్యత

**ఉస్మానియా యూనివర్సిటీ:** సంస్కృత భాష ఆచార వ్యవహారాలకు మాత్రమే పరిమితం కాలేదని శాస్త్ర సాంకేతిక రగంలోను ప్రాముఖ్యత సంతరించుకుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో భాష, సంఘం అనే అంశం పై జాతీయ వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి శిక్షణ మండలి తెలంగాణ అధ్యక్షులు ప్రొ.శివరాజ్ అధ్యక్షత వహించగా శాతావాహన మాజీ వీసీ ప్రొ.వీరారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

# అంబేడ్కర్‌కు ఘన నివాళి

**బౌద్ధనగర్:** భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు గురువారం బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురంలో ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పాండు ఆధ్వర్యంలో సం విధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, శ్యామ్‌రాజ్, లడ్డు, సంపత్, చైతన్య, నాగమణి, సుదర్శన్, కృష్ణ, గిరి, ఓములు, సుశీల, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

## మిస్టర్ ఉస్మానియాగా ఇంజినీరింగ్ విద్యార్థి



ముజామిల్

**ఉస్మానియా యూనివర్సిటీ:** మిస్టర్ ఉస్మానియాగా హిమాయత్‌సాగర్‌లోని లార్డ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి మహ్మద్ ముజామిల్ ఎన్నికైనట్లు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ తెలిపారు. ఓయూ అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీలను ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించినట్లు తెలిపారు. ఓయూ పరిధిలోని 25 కాలేజీల నుంచి 150 మంది బాడీ బిల్డర్స్ పాల్గొనగా మహ్మద్ ముజామిల్ విజయం సాధించినట్లు తెలిపారు.

## ఊరూ వాడా శ్రీరామనామమే..

**కంటోన్మెంట్:** దేశ వ్యాప్తంగా ప్రతీ ఊరూవాడలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు ప్రతీయేటా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నేత నాగభూషణం రెడ్డి అన్నారు. అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కాకాగూడ వీరాంజనేయ స్వామి ఆలయంలో నాగభూషణం రెడ్డి- కృష్ణకుమారి దంపతుల ఆధ్వర్యంలో 108 కళశాలతో మహాకుంభాభిషేకం, తులసి దళార్చన, సీతారాముల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

## వాహనదారులకు అవగాహన

**సికింద్రాబాద్:** ట్రాఫిక్ నిబంధనలపై గురువారం చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెట్టుగూడ జంక్షన్ సమీపంలోని ఆలుగడ్డబావి కూడలిలో పలువురు వాహనదారులకు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా తమకే కాకుండా ఎదుటివారికి జరిగే నష్టాలను తెలియజెప్పారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## కబ్జాలను సహించేది లేదు: ఓయూ వీసీ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ భూములను కబ్జా చేస్తే సహించేదిలేదని వీసీ ప్రొ.కుమార్ హెచ్చరించారు. గురువారం హబ్సిగూడ వైపు గల ఓయూ ప్రహరీని సందర్శించారు. అక్రమంగా ప్రహరీ గోడను కూల్చి ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రవేటు వ్యక్తులు కూల్చిన గోడను పునఃనిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

## అమరుడి కుటుంబాన్ని ఆదుకోండి

**కంటోన్మెంట్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా ఆత్మ త్యాగానికి పాల్పడ్డ మాజీ ట్రాఫిక్ కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మోండా డివిజన్ కాంగ్రెస్ నేతలు సంతోష్ యాదవ్, యేసురత్నం, శివ తదితరులు రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌కు చెందిన అమరుడు వినోద్ తల్లి దుర్గమ్మతో పాటు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

# ఆన్‌లైన్ బిజినెస్ పేరుతో మోసం

**వెంగళరావునగర్:** ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో వ్యక్తిని మోసగించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే బి.రామ్మోహన్‌రెడ్డి ప్రైవేటు జాబ్ చేస్తుంటాడు. ఇటీవల పెట్టుబడి సలహాదారుల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నాడు. అతనికి సిద్ధార్థ్ కొటాక్ నుంచి నెంబర్లు వచ్చాయి. అక్కడి నుంచి కొన్ని సలహాలు రావడంతోపాటు ఎస్‌ఎక్స్‌ఎస్ఎల్ యాప్ సూచించారు. దాని సలహా మేరకు ఈనెల 16వ తేదీ రూ. 14,500 పంపాడు. అనంతరం 17వ తేదీన మళ్లీ రూ. 28,000 పంపాడు. అయితే ఐపీఓ కోడ్ కోసం వెతకగా కనిపించలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబరాబాద్‌లో సమాచారం అందించిన అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్ లాక్కుని పరార్

**ఫిలింనగర్:** రోడ్డుపై నిలబడ్డ జెప్టో డెలివరీ బాయ్ నుంచి ఇద్దరు ఆగంతకులు బైక్‌పై వచ్చి మొబైల్‌ను తస్కరించుకుపోయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్‌పేట ప్రాంతంలోని శ్రీలక్ష్మి ఎన్‌క్లేవ్ హాస్టల్‌లో ఉండే మోహన్‌రావు జెప్టో రైడర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు ఎమ్మెల్యే కాలనీ రోడ్డునెంబర్-92 నుంచి తనకు వచ్చిన ఆర్డర్‌ను తీసుకువెళ్లాడు. అడ్రస్ కోసం వాకబు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒమెగా హాస్పిటల్ వైపు నుంచి బైక్‌పై వచ్చి మోహన్‌రావు చేతిలోని రూ.16,500ల విలువైన వివో టిక్స్ మొబైల్‌ను లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారాలు చేసుకోవాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**సనత్‌నగర్:** ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చిరువ్యాపారులు తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను తొలగిస్తున్న నేపథ్యంలో నిరుపేదలైన ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి తమను ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో తలసాని బుధవారం బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్, ట్రాఫిక్ ఏసీపీ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఫుట్‌పాత్ వ్యాపారులలో అధిక శాతం మంది నిరుపేదలని, వారి ఉపాధిని దూరం చేసి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేయొద్దని వివరించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకునేవిధంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. దీంతో గురువారం జీహెచ్‌ఎంసీ డీసీ సమ్మయ్య, ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ఇతర అధికారులతో కలిసి మోండా డివిజన్ పాలికాబజార్, మోండా మార్కెట్, రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అంజలి టాకీస్ దర్గా, పీజీ రోడ్డు, మినిస్టర్ రోడ్డు, బేగంపేట డివిజన్‌లోని జవహర్ జనతా, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రాంతాల్లో పర్యటించి ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ అధికారులు ఉద్దేశపూర్వకంగా వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కొందరు రోడ్లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేసుకుంటూ వాహనదారులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా తమ వ్యాపారాలను చేసుకుంటే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి కొందరు రోజువారీ అద్దెలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎవరికీ అద్దెలు చెల్లించవద్దన్నారు. త్వరలోనే ఫుట్‌పాత్ వ్యాపారులకు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున్‌గౌడ్, అరుణగౌడ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుస్మిత పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని